క్లుప్తంగా

రామానగరంలో 'జగనన్నే మా భవిష్యత్తు'

లక్ష్మీపురం(చల్లపల్లి): జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శుక్రవారం లక్ష్మీపురం పంచాయతీ రామానగరంలోని జగ్జీవన్ రామ్ నగర్‌లో నిర్వహించారు. లక్ష్మీపురం గ్రామ సచివాలయం-3 కన్వీనర్ కొల్లూరి ముద్దుకృష్ణ, గృహ సారథులు, గ్రామ వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. డోర్ స్టిక్కర్లు, ఫోన్ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సింహాద్రిపై కేసుల కొట్టివేత

అవనిగడ్డ: రైతులకు సక్రమంగా సాగునీరు అందించాలని, రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేసిన ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుపై నమోదైన రెండు కేసులను స్థానిక జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ రాజన్ ప్రకాష్ కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. 2017 నవంబర్ 10న రైతులకు సక్రమంగా సాగునీరందించాలని డిమాండ్ చేస్తూ కోడూరు మండలం వి కొత్తపాలెం లాకుల వద్ద ధర్నా చేశారు. అలాగే 2018 అక్టోబర్ 15వ తేదీన కోడూరు బొమ్మల సెంటర్‌లో ఆందోళన చేశారు. ఈ కేసులకు సంబంధించి సాక్షులను విచారించిన న్యాయమూర్తి రాజన్ ప్రకాష్ సరైన సాక్ష్యాధారాలు లేనందున కేసులను కొట్టివేశారు. మరి కొంతమందిపై ఉన్న కేసులను కూడా కొట్టివేశారు.

11న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ

భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం మే 11వ తేదీన జరుగుతుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు తెలిపారు. ఆలయం వద్ద ప్రతిష్ఠించేందుకు తీసుకువచ్చిన ధ్వజస్తంభానికి శుక్రవారం గ్రామ ప్రముఖులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిరంజనరావు మాట్లాడుతూ నూతన ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు, హోమాలు మే 7 నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు.

నాలుగు ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ

మచిలీపట్నంటౌన్: బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సతీమణి జయసుధ సొంత నిధులతో నగరంలోని నాలుగు ప్రాంతాల్లో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. సర్వజన ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద రోగులు, వారి సహాయకులు, గర్భిణులకు మజ్జిగను అందజేశారు. అలాగే నగరంలోని ఈడేపల్లి, చిలకలపూడి, సుకర్లాబాద్‌లోని వృద్ధాశ్రమాల్లో ప్రతి రోజూ వృద్ధులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

110 మందికి వైద్య పరీక్షలు

బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గుడివాడలోని గురురాజు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు రెడ్డి లక్ష్మీ రోగులను పరిశీలించి మందులు అందజేశారు. కేంద్రం నిర్వాహకులు జె. వాసుదేవరావు, ఆంజనేయులు, అమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గంజివానిపాలెంపై మోపిదేవి జూనియర్ జట్టు విజయం

మోపిదేవి: మోపిదేవి జెడ్పీ పాఠశాలలో నాలుగో రోజు శుక్రవారం ఉదయం జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో గంజివానిపాలెం జట్టుపై మోపిదేవి జూనియర్ జట్టు విజయం సాధించిందని నిర్వాహకులు మలిశెట్టి శ్రీనివాసరావు, కారుమూరి శివనాగరాజు తెలిపారు. సాయంత్రం ఈలచెట్లదిబ్బ క్షత్రియ జట్టుపై మచిలీపట్నం చిట్టిపాలెంకు చెందిన సీఎస్‌కే జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నీరజ్ ఎంపికయ్యారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- మంత్రి ఆర్‌కే రోజా
- మచిలీపట్నం మెడికల్ కళాశాల సందర్శన



మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

కోనేరుసెంటర్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర యువజన వ్యవహారాలు, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖా మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు నిర్మించి వాటికి అనుసంధానంగా ఆస్పత్రులు నిర్మిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యేలు పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి నాని, వల్లభనేని వంశీ, కొలుసు పార్థసారథి, సింహాద్రి రమేష్, కైలే అనిల్‌కుమార్‌లతో కలిసి మచిలీపట్నంలోని మెడికల్ కళాశాల నిర్మాణ పనులను శుక్రవారం ఆమె పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ లైబ్రరీ పనులను పరిశీలించారు. పనుల పూర్తిపై ఆరా తీయగా మరో 15 రోజుల్లోగా కొన్ని బ్లాక్‌లకు సంబంధించిన పనులు దాదాపు పూర్తి చేస్తామని అధికారులు ఆమెకు తెలిపారు. మంత్రి రోజా మాట్లాడుతూ మెడికల్ కళాశాల పనులు ఊహించని స్థాయిలో జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి చేయలేని మెడికల్ కళాశాల నిర్మాణ పనులను తాను ముఖ్యమంత్రి అయిన నాలుగేళ్లలో చేసి చూపిస్తున్న ముఖ్యమంత్రి మన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. రాష్ట్రం పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల ఆయనకు ఉన్న అభిమానం, రాష్ట్రాభివృద్ధి కోసం ఆయన పడుతున్న కష్టాన్ని ప్రజలు చూస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని ప్రతిపక్షం గ్రహించాలన్నారు. కొన్ని పత్రికల్లో మెడికల్ కళాశాల నిర్మాణంపై అసత్య కథనాలు రాయించడం సరికాదన్నారు. నంద్యాల, విజయనగరం, ఏలూరుకు మొదటి సంవత్సరం కోర్సులు ప్రారంభించేందుకు అనుమతులు వచ్చాయని చెప్పారు. కృష్ణాజిల్లాకు రెండు ఇన్స్పెక్షన్లు జరిగాయన్నారు. మచిలీపట్నం మెడికల్ కళాశాలకు మరో రెండు రోజుల్లో అనుమతులు వస్తాయన్నారు. నెలాఖరులోగా పనులు దాదాపు పూర్తి చేయాలని మెగా కంపెనీకి ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. కళాశాల నిర్మాణ పనులు ప్రారంభించిన రెండేళ్లలోనే మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నాయంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప తనమేనని వివరించారు. వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవితా నోబుల్, ముడా చైర్మన్ బొర్రా నాగదుర్గాభవాని, డీఆర్వో వెంకటేశ్వర్లు, బందరు ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ డి. సునీల్‌బాబు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మంత్రి రోజాకు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాజాబాబు, పేర్ని నాని

మంత్రి రోజాకు ఘన స్వాగతం..

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆర్‌కే రోజాకు శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఘనస్వాగతం లభించింది. అతిథిగృహంలో ఆమె పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి. రాజాబాబు, ఎస్పీ పి. జాషువా, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, ఎంయూడీఏ చైర్మన్ బొర్రా నాగదుర్గాభవాని, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జోగి రమేష్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, కొలుసు పార్థసారథి, వల్లభనేని వంశీ తదితరులు కొద్దిసేపు మంత్రి రోజాతో ముచ్చటించారు.

ఇటువంటి స్ఫూర్తే కావాలి

కృత్తివెన్ను జెడ్పీటీసీని సత్కరించిన మంత్రి జోగి రమేష్



జెడ్పీటీసీ రత్నకుమారి దంపతులను సత్కరిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: పార్టీ ఆదేశాలను కృత్తివెన్ను జెడ్పీటీసీ మైల రత్నకుమారి చిత్తశుద్ధితో అమలు చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆమె కృత్తివెన్ను పంచాయతీలో 1500లకు పైగా గృహాలను సకాలంలో సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారన్నారు. ఇదే విధంగా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సకాలంలో నిర్వహించాలని సూచించారు. రత్నకుమారితో పాటు ఆమె భర్త రమేష్‌ను మంత్రి శుక్రవారం తన కార్యాలయంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మంత్రి తనయుడు జోగి రాజీవ్, పడతడిక సర్పంచ్ ప్రదీప్‌కుమార్, స్థానిక నాయకులు జయరాజు, జోజిబాబు, వీరబాబు పాల్గొన్నారు.

సీతారావమ్మకు ప్రముఖుల నివాళి

కోడూరు: కోడూరుకు చెందిన మాజీ సమితి అధ్యక్షుడు దివంగత కోట కేశవ పెరుమాళ్లు సతీమణి సీతారావమ్మ (87) మృతిచెందారు. రెండు రోజుల నుంచి సీతారావమ్మ మచిలీపట్నంలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందారు. శుక్రవారం సీతారావమ్మ మృతదేహాన్ని ఇస్మాయిల్‌బేగ్‌పేటలోని నివాస గృహానికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ సీతారావమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో మూడవ కుమారుడు కోట పద్మావతి వరప్రసాద్ వైఎస్సార్ సీపీ ముఖ్యనేతగా వ్యవహరిస్తున్నారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, వివిధ పార్టీల నేతలు, సీతారావమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

కోనేరుసెంటర్: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగాధిపతి రామశేఖర్‌రెడ్డి తెలిపారు. యూనివర్సిటీ రసాయనశాస్త్ర విభాగంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండో సంవత్సరం విద్యార్థులు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. అపుడే అవకాశాలు అందిపుచ్చుకోగలరన్నారు. అధ్యాపకుడు కె. సీతాలు మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. అధ్యాపకులు జి. రవి, వెంకట్రావు, అనిల్‌కుమార్, పుష్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ పని కల్పించాలి

గూడూరు: కూలీలకు ప్రతి రోజూ పని కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఓలు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ అన్నారు. రాయవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీలు తమకు రోజూ పని కల్పించడం లేదని పీడీకి ఫిర్యాదు చేయడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో వసతులు కల్పించాలన్నారు. అనంతరం జగనన్న కాలనీ లే అవుట్ ను పరిశీలించిన పీడీ మే 10వ తేదీలోగా 15 మంది లబ్ధిదారులు బేస్‌మెంట్లు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు.

తాగునీటి చెరువు అభివృద్ధి

మాజేరు(చల్లపల్లి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మాజేరు పంచాయతీ పచ్చార్లంకలో తాగునీటి చెరువును అభివృద్ధి చేశారు. శుక్రవారం ఉపాధి పథకం కూలీలు చెరువు చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు తొలగించారు. సర్పంచ్ కల్లేపల్లి లక్ష్మీ, ఎంపీటీసీ తమ్ము లక్ష్మీ, వైఎస్సార్ సీపీ నాయకులు కల్లేపల్లి లక్ష్మీనారాయణ, తమ్ము మనోజ్ పర్యవేక్షించారు.

జ్వరాలపై సర్వే నిర్వహించండి

డీఎంహెచ్ఓ డాక్టర్ గీతాబాయి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ గీతాబాయి

చిలకలపూడి(మచిలీపట్నం): క్షేత్రస్థాయిలో జ్వరాల బారిన పడిన వారి వివరాలను తెలుసుకునేందుకు సర్వే నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి అన్నారు. ఆమె కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అనుమానిత వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి తగిన మందులు అందజేయాలని సూచించారు. ప్రజల్లో కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా అవ్వా, తాతలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరాన్ని బట్టి కళ్లజోళ్ల పంపిణీ, కంటి శుక్లాల శస్త్రచికిత్సలు చేయించాలని చెప్పారు. పుట్టినబిడ్డ నుంచి అర్హులైన వారందరికీ వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. డీఈఓ డాక్టర్ శర్మిష్ట, బి. రామారావు, బి. శివసాంబిరెడ్డి, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డీతో కలిపి బీమా సొమ్ము చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): వడ్డీతో సహా బీమా సొమ్ము చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీ రాయలు శుక్రవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నానికి చెందిన పోలవరపు గౌతం 2018 నవంబరు 13వ తేదీన రూ. 15 లక్షలకు హెచ్‌డీఎఫ్‌సీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలో హెల్త్ పాలసీ తీసుకున్నారు. అనారోగ్యరీత్యా ఆస్పత్రిలో చేరి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 13,38,846 ఇన్సూరెన్స్ క్లయిమ్ చేశారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు క్లయిమ్‌ను నిరాకరించడంతో గౌతం వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు. వివరాలను తెలుసుకున్న అనంతరం బీమా రూ. 6,36,719తోపాటు 2022 జనవరి 13వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని, మానసిక వేదనకు రూ. 50 వేలు, ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు చెల్లించాలని, ఈ మొత్తాలను తీర్పు వెలువడిన 30 రోజుల్లోగా చెల్లించాలని ఫోరం ఆదేశించారు.

చిరు ధాన్యాల వినియోగంపై అవగాహన

రావివారిపాలెం(మోపిదేవి): చిరుధాన్యాలను ప్రతి ఒక్కరూ ఆహారంలో తీసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీలత అన్నారు. రావివారిపాలెంలో ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో శుక్రవారం చిరుధాన్యాలతో విలువ ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం 2023కు ప్రాముఖ్యత కల్పించిందన్నారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి. కృష్ణవేణి మాట్లాడుతూ చిరుధాన్యాల ప్రాముఖ్యతను వివరించి అందులో లభించే పోషకాలు, ఆరోగ్య ప్రయోజనాలను తెలిపారు. కొర్రలతో పాయసం, వడల తయారీ విధానాన్ని వివరించి మహిళలతో తయారు చేయించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వి. మంజువాణి, జె. యశ్వంత్‌కుమార్, డాక్టర్ కె. రేవతి, డాక్టర్ బి. నవీన్‌కుమార్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

అవనిగడ్డ: స్థానిక సెయింట్ ఆన్స్ సంస్థ ఆధ్వర్యంలో 63 మంది వితంతువులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. సెయింట్ ఆన్స్ హాస్పటల్ వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆదర్శ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘంలోని 63 మంది వితంతువులకు సెయింట్ ఆన్స్ సుపీరియర్స్ సిస్టర్ మౌళీ థామస్ నిత్యావసర వస్తువులను అందించారు. సొసైటీ ఇన్‌చార్జి సిస్టర్ ఏసుమరియ పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: గాంధీబొమ్మ శివాలయం ఆవరణలోని అయ్యప్ప స్వామి ఆలయ 32వ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం లలితా సహస్రనామ సప్తాహ కార్యక్రమం జరిగింది. మహంకాళి రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో లక్ష మల్లెలతో పూజ నిర్వహించారు. సాయంత్రం సువాసినులతో సామూహిక కుంకుమార్చన జరిగింది.

9న జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభం

కలెక్టర్ పి.రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా, జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): స్పందన కార్యక్రమం కంటే మెరుగైన విధంగా అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా నాణ్యమైన పరిష్కారం చూపేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మే 9వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్పందన అర్జీలు, జగనన్నకు చెబుదాం, పేదలందరికీ ఇళ్లు, నాడు-నేడు, రీ-సర్వే అంశాలపై ఆయన జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులతో మాట్లాడారు. జిల్లాకు సంబంధించిన రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి తదితర అంశాలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు వస్తున్నాయన్నారు. వీటిలో 4,265 అర్జీలు రాగా 3,855 అర్జీలు పరిష్కరించామని చెప్పారు. మిగిలిన వాటిని గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు పథకం రెండో విడత కార్యక్రమంలో 488 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేయాలని రూ.179.81 కోట్లు మంజూరయ్యాయన్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లను జూన్ 12 నాటికి ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. మొదటి విడతలో చేపట్టిన రీ-సర్వే పనులకు సంబంధించి లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఎస్పీ పి జాషువా, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ జీవీ సూర్యనారాయణ, సర్వే ఏడీ గోపాలరాజా, డీఈఓ తాహెరాసుల్తానా పాల్గొన్నారు.

ఎంయూడీఏ అధికారులతో సమీక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): ఎంయూడీఏ అధికారులతో కలెక్టర్ పి. రాజాబాబు ఆయన చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఎంయూడీఏ పరిధిలో చేస్తున్న కార్యకలాపాలు ఇప్పటి వరకు సేకరించిన భూమి వివరాలు, మాస్టర్ ప్లాన్ తదితర అంశాలపై ఆయన చర్చించారు. బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి ఆరు గ్రామాల్లో 639 ఎకరాల భూమిని కొనుగోలు చేశామని, అందులో 55 ఎకరాలు రోడ్డు, రైలు మార్గానికి ఇచ్చామని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఎంయూడీఏ వీసీ కె. రాజ్యలక్ష్మీ, కార్యదర్శి సరళ, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ సృజన పాల్గొన్నారు.

హోరాహోరీగా బార్ అసోసియేషన్ ఎన్నికలు



అధ్యక్షుడు తుంగల హరిబాబు



ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు



ప్రధాన కార్యదర్శి కె. రఘురామ్

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. వింజమూరి శివరాం ఎన్నికల అధికారిగా వ్యవహరించి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఓట్ల లెక్కింపు జరిగింది. అధ్యక్ష స్థానానికి ముగ్గురు న్యాయవాదులు వీవీ వరదరాజులు, తుంగల హరిబాబు, జీవీఎల్ నరసింహారావు పోటీ పడ్డారు. తుంగల హరిబాబుకు 167 ఓట్లు వచ్చి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శి స్థానానికి కొట్టి రఘురాం, ఎస్ఎస్ఎస్ సాయిబాబు పోటీ పడగా రఘురామ్ 203 ఓట్లతో గెలిచారు. మిగిలిన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షునిగా మట్టా వెంకట సుబ్బారావు, కోశాధికారిగా ఎం. ఫణికుమార్, కార్యదర్శిగా సర్వా లలితకుమారి, లైబ్రరీ కార్యదర్శిగా పసుమర్తి సూర్యప్రకాశరావు, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యదర్శిగా టి. రూపారాణి ఎన్నికయ్యారు.

వంట గ్యాస్ ధరలు తగ్గించాలని ధర్నా

చల్లపల్లి: కేంద్ర ప్రభుత్వం తక్షణమే వంట గ్యాస్ ధరలు తగ్గించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు మల్లుపెద్ది రత్నకుమారి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ రూ. 400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత రూ. 1150కి పెరిగిందని విమర్శించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెడన: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అజెండాలో పది అంశాలపై చర్చించి ఆమోదం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో- ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

నేడు, రేపు అంకాల దేవర జాతర

భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లిలోని అంకాల దేవర అమ్మవారి జాతర మహోత్సవం శని, ఆదివారాల్లో నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త ముమ్మారెడ్డి వెంకట సత్యనారాయణ (సత్తిబాబు) శుక్రవారం తెలిపారు. జాతర సంప్రదాయ రీతిలో శనివారం ప్రత్యేక పూజలు, 30వ తేదీన గుడి సంబరం జరుగుతుందని, ఈ సందర్భంగా భక్తులు నైవేద్యాల సమర్పణ, మొక్కుబడులు చెల్లించుకుంటారని చెప్పారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

మేళ్లమర్తిలంక(మోపిదేవి): జగనన్న లే అవుట్స్‌లో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు ఎంపీడీఓ పార్వతి, మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ రాజులపాటి తాండవ కృష్ణ సూచించారు. రావివారిపాలెం 4వ నెంబర్ లే అవుట్, మేళ్లమర్తిలంక లే అవుట్లనును శుక్రవారం వారు పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఏఈ తాండవ కృష్ణ, గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ బందారు ఏడుకొండలు, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భర్తపై దాడి

పెడన: మద్యం మత్తులో మహిళలతో గొడవ పడుతున్న వ్యక్తిని ప్రశ్నించినందుకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భర్తపై దాడి చేసిన ఘటన గురువారం సాయంత్రం జరిగింది. ఈ ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం మండలం నెలకుర్రు గ్రామానికి చెందిన బొమ్మసాని శివసాయి పదో వార్డులోని కాలనీ వద్ద మద్యం సేవించి అక్కడ ఉన్న మహిళలతో వాగ్వాదానికి దిగాడు. ఈ విషయాన్ని వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బైలపాటి జ్యోతి దృష్టికి మహిళలు తీసుకువెళ్లారు. ఆమె భర్త చిన్నారావు ఘటనా స్థలానికి చేరుకుని గొడవ పడుతున్న శివసాయిని ప్రశ్నించారు. దీనిపై ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన శివసాయి చిన్నారావుపై దాడి చేశాడు. స్థానికులు శివసాయిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. చిన్నారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కౌన్సిలర్ ఇంటిపై యువకుల దాడి

కేసు నమోదు

పెడన: 17వ వార్డు కౌన్సిలర్ మెట్ల గోపీ ప్రసాద్ ఇంటిపై ముగ్గురు యువకులు గురువారం అర్ధరాత్రి దాడి చేశారు. పెడన వీరభద్రపురానికి చెందిన రామిశెట్టి అయ్యప్పస్వామి (31), జోగి భాను ప్రసాద్ (21), మచిలీపట్నం వలందపాలెంకు చెందిన రామిశెట్టి కిరణ్ (21) కౌన్సిలర్ ఇంటి వద్దకు వచ్చి బయటకు రావాలంటూ పెద్దగా కేకలు వేశారు. ఇంటి ముందు నానా బీభత్సం సృష్టించారు.
తలుపులు తీయకుండా కౌన్సిలర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ముగ్గురు యువకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మద్యం మత్తులో ఉన్న యువకులు స్టేషన్‌లో పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పాటు కిటికీ అద్దాలు, దేవుని పటాలను ధ్వంసం చేశారు. కౌన్సిలర్ గోపీ ప్రసాద్ ఫిర్యాదు మేరకు పెడన పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.



